సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం ၊ 10 ၊ అక్టోబర్ ၊ 2023



సోమశిలలో 29.893 టీఎంసీలు

చేజర్ల (సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 29.893 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 91.568 మీటర్ల నీటి మట్టం ఉంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.59,130
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,327
3శాతం జీఎస్టీతో	రూ.5,487
నవర (8గ్రా)	రూ.43,896

గరిష్టం/కనిష్టం
37.6 /28.2

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 87 శాతం ఉంది. మంగళవారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు కొంత తగ్గే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

స్పందనకు 165 ఫిర్యాదులు



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 165 మంది తమ ఫిర్యాదులను ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డికి అందజేశారు. ప్రధానంగా ఉద్యోగాల పేరిట మోసాలు, సైబర్‌నేరాలు, అత్తింటి వేధింపులు, దొంగతనం కేసుల్లో రికవరీ, అనధికార చీటీలు తదితరాలపై ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన ఎస్పీ నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో ఫిర్యాదులను పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు లక్షలు వసూళ్లు చేసి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అలాంటి వారి పట్ల నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఫిర్యాదుదారులకు భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, డీఎస్పీలు శ్రీనివాసరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

భూపంపిణీకి ప్రతిపాదనలు

పొదలకూరు: అసైన్మెంట్ రివ్యూ కమిటీ ద్వారా మండలంలో 607 మందికి 829.36 ఎకరాల భూములను అందజేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తహసీల్దార్ కే.వీరవసంతరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో అర్హులైన పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలను అందజేయడంతో పాటు, కొత్తగా అర్హులను గుర్తించి భూములకు పట్టాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అసైన్మెంట్ రివ్యూ కమిటీ సమావేశంలో ప్రతిపాదనలు అనుమతులు పొందిన తర్వాత లబ్ధిదారులకు పట్టాలను అందజేస్తామన్నారు.

రేపు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 11వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి జెడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయన్నారు. సమావేశాలకు ఆయా స్థాయీ సంఘాల సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

13 నుంచి రోలర్ స్కేటింగ్ జట్టు ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపికలు స్థానిక చిల్డ్రన్స్ పార్కులో ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.ఈశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలలో పాల్గొనే క్రీడాకారులు తమ పాఠశాల వారిచే ధ్రువీకరించబడిన పత్రాలు, ఆర్ఎస్ఎఫ్ఐ యాన్యువల్ రిజిస్ట్రేషన్ ఫామ్‌ను ఈనెల 11వ తేదీ సాయంత్రం 8 గంటలలోపు చిల్డ్రన్స్ పార్కులోని స్కేటింగ్ రింగ్ వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అప్లికేషన్ నమోదు కోసం 80744 01376 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఘనంగా మస్‌కూర్ బాబా గంధ మహోత్సవం



దర్గాకు గంధాన్ని తీసుకొస్తున్న దృశ్యం

చేజర్ల(సోమశిల): అనంతసాగరంలో హజరత్ సయ్యద్ మస్‌కూర్ బాబా 3వ గంధ మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. గంధ మహోత్సవంలో భాగంగా గంధ కలశానికి ఊరేగింపు నిర్వహించి దర్గా వద్దకు తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దర్గాలోని స్వామి వారి సమాధులకు గంధం పూసి అనంతరం భక్తులకు గంధంను ప్రసాదంగా పంచారు. తెలుగు రాష్ట్రాలతో పాటు, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. అందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా పీఠాధిపతులు హజ్రత్ సయ్యద్ షా సాని సాహెబ్ ఖిల్లు, హజ్రత్ సయ్యద్ సా మజిత్, ఆలీషా ఖాదరి సాహెబ్‌లు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమస్తు



ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కారు వైద్య రంగంలోనే విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని గత నెలలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ సూచనల మేరకు పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్, హెల్త్ శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నారు.

పేదల ఆరోగ్యానికి రక్ష 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- వారం రోజుల్లో 183 కేంద్రాల్లో 61,848 మందికి వైద్యపరీక్షలు
- విజయవంతంగా నిర్వహిస్తున్న అధికారులు
- సురక్ష శిబిరాలకు ప్రజలు అధికంగా హాజరు
- అందరికీ వైద్యసేవలు అందేలా ప్రత్యేక ప్రణాళిక
- నవంబర్ 15 వరకు గడువు పొడిగింపు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పాల్గొన్న ప్రజలు (ఫైల్)



శిబిరంలో పాల్గొన్న మహిళలకు కంటిపరీక్షలు

నెల్లూరు సిటీ: నెల్లూరు జిల్లాలో గత నెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొత్తం 61 పీహెచ్‌సీలు, 28 యూపీహెచ్‌ల లో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 150 మంది వైద్యులు కార్యక్రమంలో పాల్గొంటున్నారు. 30వ తేదీన రూరల్‌పరిధిలో 33 హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశారు. 3వ తేదీన రూరల్‌లో 33, అర్బన్‌లో 2, 4వ తేదీన రూరల్‌లో 21, 5వ తేదీన రూరల్‌లో 33, అర్బన్‌లో 3, 6వ తేదీన రూరల్‌లో 22, అర్బన్‌లో ఒకటి, 7వ తేదీన రూరల్‌లో 35 హెల్త్ క్యాంపులు నిర్వహించారు. శనివారానికి మొత్తం 183 హెల్త్ సెంటర్‌లలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 54 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. 174 రకాల మందులు అందచేస్తున్నారు.

వైద్య పరీక్షలకు 61,848 మంది హాజరు

జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి భారీగా ప్రజలు హాజరవుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య పరీక్షల క్యాంపులకు క్యూ కట్టారు. పురుషులు 26,710, మహిళలు 35,137 మంది హెల్త్ క్యాంపులకు హాజరై వివిధ పరీక్షలు చేయించుకున్నారు. ఎక్కువగా కంటి సమస్యలను వైద్యులు గుర్తించారు. 1204 శుక్లం సమస్యలు ఉన్నాయి. 1801 జనరల్ కేసులను వివిధ వైద్యులకు రిఫర్ చేశారు. అదే విధంగా గైనిక్, ఆర్థోపెడిక్, ఎముకల సమస్యలు వైద్యులు గుర్తించారు. అవసరమైన వారికి మందులు అందచేశారు. సర్జరీలు నిర్వహించాల్సిన వారిని ఇతర ప్రభుత్వ వైద్యులకు రెఫర్ చేసి ఆరోగ్యశ్రీలో చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

జగనన్న సురక్ష

అన్ని శాఖలు సమన్వయంతో..

కలెక్టర్ సూచనల మేరకు పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్, హెల్త్ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. వలంటీర్‌ల ద్వారా ప్రతి ఇంటికి టోకెన్ ఇచ్చి హెల్త్ క్యాంపులకు ఎప్పుడు రావాలో సూచిస్తున్నారు. అనంతరం వచ్చిన వారికి ఇబ్బంది కల్గకుండా హెల్త్, శానిటరీ సచివాలయ కార్యదర్శులు సహకరిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో కమిషనర్ వికాస్ మర్మత్, జిల్లా వైద్యశాఖ అధికారి పెంచలయ్య, ఎంహెచ్ఓ వెంకటరమణలు క్షేత్రస్థాయిలో హెల్త్ క్యాంపులను పర్యవేక్షిస్తున్నారు. మొత్తం 60 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 90 మంది మెడికల్ ఆఫీసర్‌లు హెల్త్ క్యాంపుల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

హెల్త్ క్యాంపులకు భారీగా వస్తున్న ప్రజలు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈనెల చివరికి పూర్తి చేయాల్సి ఉంది. అయితే భారీగా ప్రజలు హెల్త్ క్యాంపులకు తరలిరావడంతో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించేందుకు నవంబర్ 15వ తేదీ వరకు గడువు పొడిగించాం. పీహెచ్‌సీలలో, యూపీహెచ్‌సీలలో ఒక్క రోజు హెల్త్ క్యాంపును రెండు, మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు.

–జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య

ప్రజలతో మమేకమయ్యేలా..

- బ్రేక్ ఫాస్ట్/ లంచ్ విత్ ఎమ్మెల్యే
- సరికొత్తగా అమలు చేస్తున్న ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి
- పంచాయతీ స్థాయి నాయకులతో ఆత్మీయ సమావేశాలు
- నేతలు చెప్పిన సమస్యలు సావధానంగా విని పరిష్కారానికి కృషి

సహజంగా ప్రజాప్రతినిధి స్థానిక నేతలతో కలిసి భోజనం చేయడం సర్వసాధారణమే. కానీ ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యేగా గ్రామస్థాయి నాయకులతో మమేకమయ్యేందుకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం గ్రామస్థాయి నేతలలో కలిసి చేసే కార్యక్రమం ప్రారంభించారు. గత నెల రోజులుగా విడతల వారీగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు.



గ్రామస్థాయి నేతలతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మేకపాటి విక్రమ్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయిన అనంతరం తనదైన పంథాలో సరికొత్త కార్యక్రమాలకు నాంది పలికాడు. విద్యావంతుడైన విక్రమ్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి విషయంలో తన ఆలోచనలకు పదును పెట్టి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. ఓవైపు ప్రజా సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టడమే కాకుండా, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గడప గడపకు కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువ అయ్యాడు. గ్రామస్థాయిలో నేతలతో సత్సంబంధాలను మరింత పెంచుకునేందుకు వారికి ప్రత్యేక సమయం కేటాయించేందుకు కొత్తగా బ్రేక్‌ఫాస్ట్/లంచ్ విత్ మేకపాటి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని 135 పంచాయతీల వారీగా ప్రతి పంచాయతీలో కీలకమైన నేతలతో కలిసి విందులో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. తొలివిడతలో మర్రిపాడు, ఆత్మకూరు మండలాల పరిధిలో దాదాపు 14 పంచాయతీల నేతలను తన నివాసానికి ఆహ్వానించి ఉదయం వేళ ఓ పంచాయతీ నేతలతో అల్పాహారం, మధ్యాహ్నం వేళ మరో పంచాయతీ నేతలతో కలిసి భోజనం చేస్తున్నారు.

గంట సమయం కేటాయింపు..

ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం పంచాయతీల వారీగా నేతలతో సుమారు గంట పాటు సమయం కేటాయిస్తున్నారు. గ్రామస్థాయిలో నెలకొన్న సమస్యలు సావధానంగా వినటం, ఆ సమస్యలు పరిష్కార మార్గానికి నేతలతో కలిసి చర్చించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇప్పటికే 14 పంచాయతీల పరిధిలో గ్రామస్థాయి నేతలతో సమావేశం అయ్యారు. నియోజకవర్గంలో తాను చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు, సొంత నిధుల (ఎడీఎఫ్) ద్వారా చేపట్టబోయే కార్యక్రమాలు కూడా చర్చిస్తున్నారు. గ్రామ స్థాయి నాయకుల సమక్షంలోనే ప్రతి గ్రామానికి ఇద్దరు నేతలను ఎంపిక చేసుకుని వారి ద్వారానే గ్రామ స్థాయిలో అన్ని పనులు చక్కబెట్టేలా ప్రణాళిక రూపొందించారు. ఈ విషయమై ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డితో సాక్షి మాట్లాడగా 'నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఎన్నికై రెండేళ్లు కూడా పూర్తికాలేదు. అన్ని పంచాయతీలలో నేతలు పరిచయం ఉన్నప్పటికి వారితో కలిసి మాట్లాడేందుకు తక్కువ సమయం ఉంది. వారితో మమేకం అయ్యేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నా' అని తెలిపారు.

కార్యక్రమం బాగుంది



ఎమ్మెల్యేలు నిత్యం బిజీ షెడ్యూల్లో ఉంటారు. వారితో గ్రామస్థాయి నేతలు కలిసినా తక్కువ సమయం కేటాయిస్తారు. ఏదైనా సమస్య చెప్పుకోవాలన్నా హడావుడిలో వీలుకావడం లేదు. ఈ క్రమంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చేపట్టిన ఆత్మీయ విందు కార్యక్రమం చాలా బాగుంది. గంట పాటు మాకు ఆయన సమయం కేటాయించడం ఆనందంగా ఉంది.

అక్కులరెడ్డి అంకిరెడ్డి,
బి.అగ్రహారం, అనంతసాగరం మండలం

నేతలతో మమేకం



గ్రామస్థాయి నేతలతో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మమేకమవుతున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికయి రెండేళ్లు కూడా కాలేదు. ఎంతో రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తిలా మంచి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆత్మీయ విందుతో నేతలతో మరింత చేరువ అవుతున్నారు.

గంగవరపు శ్రీనివాసులునాయుడు,
మర్రిపాడు

సంతృప్తికరంగా అర్జీల పరిష్కారం



స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, డీఆర్ఓ వెంకటనారాయణమ్మ

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ హరినారాయణన్
- 'జగనన్నకు చెబుదాం'లో ప్రజల నుంచి వినతుల స్వీకరణ
- అర్జీలు రిపీట్ కాకూడదు
- గడువులోగా ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలి

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే అర్జీలను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నెల్లూరు కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, డీఆర్ఓ వెంకట నారాయణమ్మ, జెడ్పీ సీఈఓ చిరంజీవితో కలసి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల జిల్లా అధికారులు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. ఒకసారి వచ్చిన అర్జీ మళ్లీ మళ్లీ రాకుండా సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ మండలం దేవరపాళెంకు చెందిన మర్లపాటి మురళీ 'తాను 42 సంవత్సరాలుగా ఉన్న ఇంటిని, ప్రభుత్వ పాఠశాలను దౌర్జన్యంగా కూల్చివేశారంటూ' కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మైనారిటీ గురుకుల పాఠశాలల పనులను త్వరగా పూర్తి చేయాలంటూ జిల్లా కలెక్టర్‌కు ఆవాజ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ, మెప్మా, హౌసింగ్ పీడీలు సాంబశివారెడ్డి, రవీంద్ర, నాగరాజు, డీపీఓ సుస్మిత, ఇరిగేషన్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈలు కృష్ణమోహన్, విజయన్, డీఈఓ గంగాభవాని, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, సోషల్ వెల్ఫేర్ డీడీ రమేష్, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్ కేసులో జిల్లా వాసుల పేర్లు

ఆత్మకూరు రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) కేసులో జిల్లా వాసుల పేర్లు చేరుస్తూ ఏపీసీఐడీ పోలీసులు సోమవారం మెమో దాఖలు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ కేసులో నిందితులుగా మాజీ మంత్రి పొంగూరు నారాయణ, ఆయన భార్య రమాదేవి, రమాదేవి బంధువు సాంబశివరావు, నారాయణ కళాశాల ఉద్యోగి గంగినేని ధనుంజయ్ భార్య ప్రమీల పేర్లు చేరుస్తూ సీఐడీ మెమో దాఖలు చేసింది. ధనుంజయ్ భార్య ప్రమీల ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం పంచాయతీ మజరా గ్రామమైన కొట్టాలుకు చెందిన వారు. నోట్ల రద్దు సమయంలో కూడా ధనుంజయ్ భార్య ప్రమీల పేరు అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

ఇక.. రాష్ట్ర ఫుట్‌బాల్‌కు ప్రత్యేక గుర్తింపు

- ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్
- జట్టు శిక్షణా శిబిరం ముగింపు



ఫుట్‌బాల్ నేషనల్స్‌కు ఎంపికైన టీమ్ సభ్యులతో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాబోయే రోజుల్లో రాష్ట్ర ఫుట్‌బాల్ క్రీడా రంగం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపుతో ప్రభంజనాన్ని సృష్టిస్తుందని ఏలూరు ఎంపీ, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సోమవారం నెల్లూరులో ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న రాష్ట్ర సీనియర్ ఫుట్‌బాల్ జట్టు శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గతంలో మాదిరిగా కాకుండా ఈసారి రాష్ట్ర జట్టును డివిజన్ల వారీగా పోటీలు నిర్వహించి ఎంపిక చేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు ఇస్తున్న ప్రోత్సాహంతో ఫుట్‌బాల్ క్రీడా రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ అందజేస్తామన్నారు. ఫుట్‌బాల్ క్రీడా రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు లీగ్ పోటీలను నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. టోర్నీలు నిర్వహించడంలో, ఆతిథ్యం ఇవ్వడంలో కూడా రాష్ట్ర ఫుట్‌బాల్ క్రీడారంగాన్ని ముందుంచుతామన్నారు. ఇందులో భాగంగా అనంతపురంలో సబ్ జూనియర్ జాతీయ ఫుట్‌బాల్ క్రీడలకు ఆతిథ్యమిచ్చామన్నారు. సబ్‌జూనియర్ స్థాయి నుంచే క్రీడాకారులను ఎంపిక చేసుకుని ప్రణాళికా బద్ధంగా శిక్షణ ఇస్తే రాబోయే రోజుల్లో రాష్ట్ర క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర జట్టు సభ్యులను ప్రకటించి, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన క్రీడాకారుడు తరుణ్‌ను కెప్టెన్‌గా నియమిస్తున్నట్లు వెల్లడించారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ కోటగిరి శ్రీధర్

ప్రముఖ న్యాయవాది, నెల్లూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నెల్లూరులో నిర్వహించిన రాష్ట్ర సీనియర్ జట్టు శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులు ఈనెల 13వ తేదీ నుంచి మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే జాతీయ సీనియర్ నేషనల్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ సంతోష్ ట్రోఫీకి రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ జట్టుకు శిక్షణా శిబిరాలను నెల్లూరులో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కోచ్‌లు పాండురంగారావు, కృష్ణారెడ్డి, సాయి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి ఉమాశంకర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకున్నాం

- రక్షణ కల్పించాలని ఎస్పీకి ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): ప్రేమించి పెళ్లిచేసుకున్న తమకు తల్లిదండ్రుల నుంచి రక్షణ కల్పించాలని ఓ ప్రేమ జంట సోమవారం జిల్లా ఎస్పీని ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే.. కావలికి చెందిన వెంకటగాయత్రి నెల్లూరు రూరల్ మండలం కనుపర్తిపాడుకు చెందిన అజయ్‌రెడ్డిలు గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల వారు ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి యువతి తల్లిదండ్రులు, కావలి ఒకటో పట్టణ పోలీసులు వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ విషయాలను ప్రేమ జంట సోమవారం స్పందన కార్యక్రమంలో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లి తమకు రక్షణ కల్పించాలని కోరారు. స్పందించిన ఎస్పీ తగిన చర్యలు తీసుకోవాలని కావలి ఒకటో పట్టణ పోలీసులను ఆదేశించారు.

క్లుప్తంగా

20న కలువాయిలో జగనన్నకు చెబుదాం

నెల్లూరు(దర్గామిట్ట): ఈ నెల 11వ తేదీన కలువాయిలో నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని, ఈ నెల 20వ తేదీన ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్పును ప్రజలందరూ గమనించి కలువాయి మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 20న జరిగే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తమ సమస్యలపై అర్జీలు అందజేసి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

చంపుతామని బెదిరించి..

• స్కూటీ, చైన్, ఫోన్ దోపిడీ

నెల్లూరు(క్రైమ్): యువకుడిని చంపుతామని బెదిరించి బంగారు గొలుసు, ఫోన్, స్కూటీలను దుండగులు దోచుకెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇందుకూరుపేట మండలం జగదేవిపేటలో నవీన్ నివాసం ఉంటున్నారు. ఆయన నెల్లూరు నగరంలోని ఓ ఫర్నిచర్‌షాపులో పనిచేస్తున్నారు. ఈనెల 8వ తేదీన ఏసీనగర్‌లోని ఓ ఫర్నిచర్‌షాపులో ఆర్డర్ తీసుకున్నారు. అనంతరం తన స్కూటీపై ఇస్కాన్ సిటీ మీదుగా ఇంటికి బయలుదేరారు. జాతీయ రహదారి పైకి వెళుతున్న క్రమంలో మార్గమధ్యంలో మూత్రవిసర్జన చేస్తుండగా గుర్తుతెలియని ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి సెల్‌ఫోన్ లైట్ వేసి ఏం చేస్తున్నావురా అని అతనిని ప్రశ్నించారు. అనంతరం కత్తితో చంపుతామని బెదిరించి మెడలోని ఒకటిన్నర సవర్ల బంగారు చైన్, వీవో సెల్‌ఫోన్, హోండా యాక్టివా స్కూటీని దోచుకుని పరారయ్యారు. ఈ మేరకు బాధితుడు సోమవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాచ్‌మన్ అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైమ్): వాచ్‌మన్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కారుమంచి గ్రామానికి చెందిన మస్తాన్‌వలి(68) – మొగలాబి దంపతులు. వారికి నలుగురు పిల్లలు. అందరికీ వివాహమైంది. మస్తాన్‌వలి బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏడాదిగా ఆయన నెల్లూరు నగరానికి చెందిన ఖాజామొహిద్దీన్ అనే మేస్త్రీ వద్ద పనులు చేసుకుంటూ నెల్లూరులో ఉంటున్నారు. అప్పుడప్పుడూ భార్య, పిల్లల వద్దకు వెళ్లివచ్చేవాడు. మూడు నెలలుగా తల్పగిరికాలనీలో నిర్మాణంలో ఉన్న ఇంటికి వాచ్‌మన్‌గా ఉంటున్నారు. అక్కడే నివాసం ఉంటూ నిర్మాణ పనులు చేస్తున్నారు. ఈ నెల 8వ తేదీన మస్తాన్‌వలి తన ఇంటి యజమాని రాంప్రసాద్‌కు ఫోన్ చేసి డబ్బులు కావాలని అడిగారు. ఆయన డబ్బులు ఇచ్చేందుకు ఇంటికి వెళ్లగా మస్తాన్‌వలి కనిపించలేదు. ప్రమాదవశాత్తో మరే ఇతర కారణమో తెలియదు కానీ మస్తాన్‌వలి తాను నివాసం ఉంటున్న ఇంటి ముందు ఉన్న నీటి సంపులో బోర్లాపడి మృతిచెంది ఉండడాన్ని సోమవారం ఖాజామొహిద్దీన్ గుర్తించారు. జరిగిన విషయాన్ని ఒంగోలులో ఉంటున్న మృతుడి కుమారుడు కోటాసాహెబ్‌కు తెలియజేశారు. ఆయన నెల్లూరుకు చేరుకుని తన తండ్రి మృతిపై వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీఈఈయూ నెల్లూరు రీజినల్ కార్యవర్గం ఏర్పాటు



ఏపీఈఈయూ నూతన కార్యవర్గం

నెల్లూరు(బృందావనం): నెల్లూరు నగరంలోని పురమందిరం ప్రాంగణం ఏసీ హాల్‌లో సోమవారం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (1104), డిస్కం యూనిట్ ఆఫ్ ఏపీఎస్పీడీసీఎల్ ప్రాంతీయశాఖ నెల్లూరు జిల్లా ఎన్నికలు జరిగాయి. ఇందుకు సంబంధించి నెల్లూరు రీజినల్ సెక్రటరీ కొండపల్లి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. ఏపీఈఈయూ (1104) తిరుపతి రీజినల్ సెక్రటరీ వి.దేవేంద్రరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కృష్ణమూర్తి పర్యవేక్షణలో ఎన్నికలు జరిగి నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటైనట్లు తెలిపారు. రీజినల్ అధ్యక్షుడిగా పి.నజీర్‌ఖాన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా కొండపల్లి శ్రీనివాసులు, కోశాధికారిగా కె.కిరణ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పలువురిని, నూతన కార్యవర్గాన్ని, యూనియన్ నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణయ్య, అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.వీరాంజనేయు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక

• రేపటి నుంచి కసుమూరు దర్గా గంధ మహోత్సవాలు
• ఏర్పాట్లలో అధికారులు



కసుమూరు మస్తాన్‌వలి దర్గా

వెంకటాచలం: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే కసుమూరు మస్తాన్‌వలి (హజరత్ సయ్యద్ కరీముల్లా షా ఖాద్రి ఉరఫ్ కాలేషా పీర్ మస్తాన్‌వలి రహమతుల్లా అలైహి) దర్గా 246వ గంధ మహోత్సవాలు బుధవారం నుంచి కసుమూరులో వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచే కాక విదేశాల నుంచి భక్తులు విచ్చేస్తారు. అలాగే కొందరు ప్రముఖులు కూడా హాజరవుతున్నారు.

కసుమూరు దర్గా చరిత్ర

చారిత్రక ఆధారాల ప్రకారం 282 ఏళ్ల క్రితం బాగ్దాద్‌లో బీబీ ఫాతిమా, కరిముల్లా షా దంపతులకు మస్తాన్‌వలి జన్మించారు. మస్తాన్‌వలి 5వ ఏటనే తల్లిదండ్రులు మృతిచెందారు. దీంతో గురువులైన హజరత్ మహబూబ్ సుభానిగౌస్, సందానీ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ సంరక్షణలోనే ఉన్నారు. గురువుల ఆదేశాల మేరకు తన 11వ ఏట హజ్వీర్ నగర్‌కు చేరుకున్నారని చరిత్ర చెబుతుంది. అక్కడ కొంతకాలం గడిపిన తరువాత కేసర మడుగు ప్రాంతానికి చేరాడు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి నెల్లూరులోని నవలాకులతోట, హుస్సేన్‌పేట, ఖాజీ నవాబుఖాన్‌పేట (ప్రస్తుతం నవాబుపేట) ప్రాంతాల్లో తిరుగుతూ తన మహిమలు ప్రదర్శించేవారు. నెల్లూరు నుంచి వెంకటాచలం మండలం కసుమూరుకు చేరుకుని యాదవుల కులానికి చెందిన మన్నాపు పుల్లమ్మ ఇంట్లో గొర్రెల కాపరిగా చేరాడు. ఈ క్రమంలో తన మహిమలు ప్రదర్శించేవారని చుట్టుపక్కల గ్రామాల వారు చెబుతుంటారు. మస్తాన్‌వలి చివరి రోజుల్లో తన మహిమలతో ప్రజల ఆరోగ్యాన్ని బాగు చేసేవారిని చెబుతుంటారు. ఈ క్రమంలో తను కసుమూరులోనే జీవసమాధి కావాలని భావిస్తున్నానని, అక్కడ దర్గా నిర్మించాలని తెలపడంతో ఆయన కోరిక మేరకు కసుమూరులో దర్గా నిర్మించినట్లు తెలుస్తోంది. అనంతరం మస్తాన్‌వలి దర్గా కసుమూరు దర్గాగా ప్రసిద్ధి చెందిందని భక్తులు చెబుతున్నారు.

గంధ మహోత్సవాలు ఇలా

కసుమూరులో మస్తాన్‌వలి దర్గా 246వ గంధ మహోత్సవాలు బుధవారం రాత్రి 12 గంటల నుంచి ప్రారంభమవుతాయి. దర్గాకు కిలోమీటరు దూరంలో ఉన్న చందన్ మహల్ నుంచి గురువారం ఉదయం 6 గంటలకు గుర్రంపై గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకువస్తారు. కడప పీఠాధిపతి ఆరీపుల్లా చదివింపులు చేసి గంధం లేపనం అనంతరం భక్తులకు పంపిణీ చేస్తారు. శుక్రవారం తహలీల్, ఫాతేహ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానుండడంతో ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు నెల్లూరు ఆర్డీఓ మలోల సూచించారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



కసుమూరు మస్తాన్‌వలి దర్గా గంధ మహోత్సవాలకు వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ ఉత్సవాలను విజయవంతంగా ముగించేందుకు అన్నిశాఖల అధికారులతో కలిసి పనిచేస్తాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఖుదావస్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్

ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నాం



హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

• కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియలోని ప్రతి దశను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. ఈ నెల 16 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు జరగనున్న ఈవీఎంలు, వీవీప్యాట్స్ మొదట దశ పరిశీలన గురించి సోమవారం కలెక్టర్ తన చాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు ఆర్డీఓ కార్యాలయం ఆవరణలోని గోడౌన్‌లో ఈవీఎంలు, వీవీప్యాట్స్ మొదటి దశ పరిశీలన ఈ నెల 16 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు ప్రతి రోజూ జరుగుతుందన్నారు. అధికారుల పర్యవేక్షణలో జరగబోయే ఈ పరిశీలనకు రాజకీయ పార్టీలు తమ ప్రతినిధులను పంపాలని సూచించారు. రాజకీయ పార్టీలు తమ ప్రతినిధుల పేర్లను ఈ నెల 14వ తేదీ లోపు తెలియజేస్తే వారికి గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు, భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ సంస్థ ఇంజినీర్ల సహకారంతో ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ పరిశీలన ప్రక్రియ పటిష్ఠంగా నిర్వహిస్తామని తెలిపారు. హాల్ లోపలికి సెల్‌ఫోన్లతో సహా ఎలాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేదన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి మురళీధర్‌రెడ్డి, టీడీపీ ప్రతినిధి సురేంద్రబాబు, బీజేపీ ప్రతినిధి శ్రీనివాస్, బీఎస్పీ ప్రతినిధి శ్రీరాం, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ధరణీకుమార్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు వినూత్న అవగాహన



ద్విచక్రవాహనచోదకులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ



ద్విచక్రవాహనదారుడికి పువ్వు అందజేస్తున్న నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివాజీ

• రోజాపూలిచ్చి హెల్మెట్ ప్రాధాన్యతను వివరించిన ట్రాఫిక్ పోలీసులు

నెల్లూరు(క్రైమ్): హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్ష అని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ సూచించారు. రోడ్డు ప్రమాద సమయంలో తలకు హెల్మెట్ లేక అనేక మంది ద్విచక్ర వాహనదారులు మృత్యువాత పడుతున్న కారణంగా వారిలో చైతన్యం తెచ్చేందుకు నగర ట్రాఫిక్ పోలీసులు సోమవారం నెల్లూరులోని చింతారెడ్డిపాళెం, బుజబుజనెల్లూరు క్రాస్‌రోడ్ల వద్ద ఈ కార్యక్రమాలు నిర్వహించారు. హెల్మెట్ వినియోగించని వాహనదారులకు రోజాపూలిచ్చి హెల్మెట్ ప్రాధాన్యతను వివరించి ఇకపై హెల్మెట్ ధరిస్తామని వారి నుంచి హామీ తీసుకున్నారు. హెల్మెట్ ధరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరు నగరంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ద్విచక్ర వాహనచోదకులు రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రోడ్డు ప్రమాదంలో కుటుంబ యజమాని మృత్యువాత పడితే ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఉందని, ఈ విషయాన్ని వాహనదారులు గుర్తుంచుకొని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ధ్రువీకరించిన ఐఎస్ఐ ముద్ర కలిగిన హెల్మెట్‌ను ధరిస్తే ప్రమాదాల నుంచి పూర్తిస్థాయిలో బయటపడవచ్చన్నారు. నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివాజీ, సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి మాట్లాడుతూ హెల్మెట్ వినియోగంపై నగరంలోని అన్ని ప్రాంతాలతోపాటు జాతీయ రహదారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. మద్యం మత్తులో, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, అతివేగంతో వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని, లేనిపక్షంలో జరిమానాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు గీతారమ్య, శివశంకర్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరం పరిశీలన



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ పంపిణీ చేస్తున్న డీఎంహెచ్ఓ పెంచలయ్య

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు–1 పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని డీఎంహెచ్ఓ పెంచలయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖ ఏర్పాటు చేసిన అన్ని హెల్త్ కౌంటర్లను సందర్శించి పరిశీలించామన్నారు. ల్యాబ్‌టెస్ట్, మందుల పంపిణీ, ఎన్‌సీడీసీడీ నాలుగు వైద్యుల కౌంటర్లు, అంగన్‌వాడీ పౌష్టికాహార కౌంటర్, రిజిస్ట్రేషన్ కౌంటర్లను పరిశీలించామని తెలిపారు. వైద్యశిబిరానికి వచ్చిన రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు రోగులకు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, పిడియాట్రిక్, గైనకాలజీ డాక్టర్లు ఎస్‌డీ అహ్మద్‌బాబు, భరత్, నవీన్, ప్రత్యూష, వినయకుమార్, ఎంపీడీఓ, వైద్య, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కలిగిరి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీను తెలిపారు. సోమవారం ఆ పాఠశాలలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్ పోటీల్లో సంగీత, కబడ్డీ క్రీడలో సీహెచ్ మైథిలి, ఎస్‌కే అహ్మదున్నీసా, లాంగ్‌జంప్, ట్రిపుల్‌జంప్ క్రీడల్లో సీహెచ్ వెంకటేష్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని తెలిపారు. క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులను పీఈటీ వెంగళరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలిండియా చెస్ విజేతకు అభినందన



ఆలిండియా చెస్ విజేత హరిరామ్‌ను అభినందిస్తున్న దృశ్యం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రతిష్టాత్మక ఆలిండియా చెస్ టోర్నమెంట్‌లో విజయం సాధించి చాంపియన్‌గా నిలిచిన నెల్లూరు వాసి పెరెచర్ల హరిరామ్ సాయికృష్ణను సోమవారం నెల్లూరు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యాలయంలో పలువురు అభినందించారు. ఈ సందర్భంగా చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.సుమన్ మాట్లాడుతూ హరిరామ్ సీనియర్ కేటగిరీలో చాంపియన్‌గా నిలిచి సంచలనాన్ని సృష్టించాడన్నారు. ఆలిండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో అగ్రగేణి అంతర్జాతీయ సీనియర్ క్రీడాకారులతో పోటీపడి 7 రౌండ్లలో 7 పాయింట్లు సాధించి విజేతగా నిలిచాడని తెలిపారు. ఈ క్రమంలో నగదు బహుమతిని సాధించడం అభినందనీయమన్నారు. హరిరామ్ ఇందుకూరుపేటలో జీవీకే చిన్మయ విద్యాలయలో 6వ తరగతి చదువుతున్నాడని, పలువురు జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్ క్రీడాకారులు తలపడిన టోర్నీలో చాంపియన్‌షిప్ సాధించడం ఒక రికార్డు అని పేర్కొన్నారు. హరిరామ్‌తోపాటు కోచ్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, తల్లిదండ్రులు ఉదయ్‌భాస్కర్, దీప్తిలను అభినందించారు.

కర్రతో దాడి.. వృద్ధురాలి మృతి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం గుండెమడకలలో ఒక వ్యక్తి కర్రతో దాడి చేసిన ఘటనలో వృద్ధురాలు మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు గుండెమడకలకు చెందిన మనోజ్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఆదిలక్ష్మమ్మ(70)పై కర్రతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆదిలక్ష్మమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. రెండు కుటుంబాల మధ్య నెలకొన్న వివాదాలే ఈ హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కోటిరెడ్డి తెలిపారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించండి



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్


• బీఎల్‌ఓల వర్క్‌షాప్‌లో కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): భారత రాజ్యాంగం అందించిన ఓటు హక్కును అర్హులైన పౌరులందరికీ చట్టబద్ధంగా కల్పించేందుకు క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు నగరంలోని వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో కోవూరు, సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై వర్క్‌షాపు నిర్వహించారు. తొలుత డీఆర్వో వెంకటనారాయణమ్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీకి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికల సిబ్బంది విధులు, బాధ్యతలపై క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రశాంతంగా పోలింగ్‌ను నిర్వహించడంలో ఓటర్ల జాబితా తయారీ ప్రధాన భూమిక పోషిస్తుందని, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీలో బూత్ లెవల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల విధులను భారంగా కాకుండా బాధ్యతగా నిర్వహిస్తే ఎన్నికల ప్రక్రియ సులభతరం అవుతుందన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి పొరపాటు జరిగినా, ఫిర్యాదులు వచ్చినా నేరుగా భారత ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందని, మళ్లీ విధుల్లో చేరాలన్నా ఎన్నికల సంఘం అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇంటింటి సర్వేలో గుర్తించిన తప్పొప్పులు, తొలగింపులు, చేర్పులు మొదలైన అన్ని అంశాలను నిర్ణీత ప్రొఫార్మాలో రూపొందించుకుని స్వచ్ఛమైన ఓటరు జాబితాను రూపొందించాలని సూచించారు. ఫాం–6, 7, 8లను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రజలకు లభించిన ఓటు హక్కును చట్ట ప్రకారం కల్పించే బాధ్యత ఎన్నికల సిబ్బందిపై ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్ బీఎల్‌ఓ హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తే అన్ని ప్రశ్నలకు స్పష్టంగా సమాధానాలు లభిస్తాయన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి 2024 జనవరి 5వ తేదీ వరకు ఎన్నికల సిబ్బంది అందరూ తమకు కేటాయించిన విధులను లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని, ఈ సమయంలో ఎలాంటి బదిలీలు ఉండవని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ 2024 జనవరి 5న ప్రచురించే తుది ఓటరు జాబితాను ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా, స్వచ్ఛంగా తయారు చేసేందుకు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు చిన్న ఓబులేసు, ప్రేమ్‌కుమార్, ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరులోని అయ్యప్పగుడి ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీప రైలు పట్టాలపై ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. మన్సూర్‌నగర్‌లో అబ్దుల్ ఖాదర్‌బాషా(56) – గౌసియా దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికీ వివాహమైంది. ఖాదర్‌బాషా ఆటోనగర్‌లో అట్టల దుకాణం నిర్వహిస్తున్నాడు. కుటుంబ, ఆరోగ్య సమస్యలతో ఆయన గత కొంతకాలంగా బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఖాదర్‌బాషా ఆదివారం అర్ధరాత్రి అయ్యప్పగుడి ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో నెల్లూరుకు వచ్చే రైలు పట్టాలపై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై ఎస్.హరిచందన తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. అనంతరం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. సోమవారం ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.55
సన్నవి : రూ.25
పండ్లు : రూ.5

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : రూ.117
లేయర్ (లైవ్) : రూ.118
బ్రాయిలర్ చికెన్ : రూ.206
స్కిన్‌లెస్ చికెన్ : రూ.230
లేయర్ చికెన్ : రూ.200